ఓం శాంతి

నిమిత్త టీచర్లు మరియు బ్రాహ్మణ కులభూషణ సోదరీ సోదరులకు మధుర స్మృతిపత్రము (11-4-17)

ప్రాణప్రియులు, అవ్యక్తమూర్తులు, మాతాపితలైన బాప్‌దాదాకు అతి స్నేహీలు, సదా పరమ శిక్షకుని శిక్షణల ద్వారా తమ జీవితాన్ని అలంకరింపచేసుకునేవారు, సదా సంతోషంగా ఉంటూ సంతోషాల ఖజానాను పంచేవారు, సహయోగీ భవ వరదానమునకు నిమిత్తమైన టీచరు అక్కయ్యలు మరియు దేశ విదేశములలోని బ్రాహ్మణ కులభూషణ సోదరీ సోదరులు ఈశ్వరీయ స్నేహ సంపన్నమైన మధుర స్మృతిని స్వీకరించండి.

పిదప సమాచారమేమిటంటే – మధురమైన, ప్రియమైన బాబా పిల్లలందరూ అవ్యక్త పాలనకు చెందిన అద్భుతమైన అనుభూతి చేస్తూ సదా సంతోషాలలో నాట్యం చేస్తూ, తమ సంతోషకర జీవితం ద్వారా బాప్‌దాదాను ప్రత్యక్షం చేసే సేవలు చేస్తున్నారు. మేమైతే మధురమైన బాబా యొక్క అద్భుతమునకు చెందిన గీతము గానం చేస్తాము – వాహ్ బాబా, వాహ్! మీరు అవ్యక్త వతనములో ఉంటూ ఇంతమంది పిల్లలను మీవైపుకు ఎలా ఆకర్షితం చేస్తున్నారు! మధువనములో అయితే ఎల్లప్పుడూ పిల్లల సభ ఉంటూనే ఉంటుంది. దేశ విదేశాల నుండి వేలాదిమంది బాబా పిల్లలు వచ్చి, జ్ఞాన రత్నాలతో తమ ఒడి నింపుకుని రిఫ్రెష్ అయి వెళ్తారు. మధురమైన బాబా పిల్లలైన మనకు అడుగడుగులో సంపాదన చేసుకోవడము నేర్పించారు. శ్రీమతముపై నడవడము ద్వారా మనందరిదీ ఎంత మంచి జీవితము తయారైంది! మనమందరము ఒక్కరికి చెందినవారం, ఒక్కరే అయినట్లయితే ఎంతటి శాంతి ఉంటుంది, ఇందులోని శాంతి ఎటువంటిదంటే వ్యర్థ చింతన నుండి ఫ్రీ అయిపోయాము. రేపు ఏమవుతుంది, ఎలా ఉంటుంది అని ఇటువంటి చింతన ఎవ్వరికీ లేదని నేను భావిస్తున్నాను. ఎందుకంటే ఏదైతే జరగబోతుందో అది చాలా మంచిగా ఉంటుందన్నది మనకు తెలుసు. బాబా మన శిక్షకుడుగానైతే ఉన్నారు, కానీ దానికి తోడుతోడుగా వారు రక్షకులు కూడా. మొత్తము జ్ఞానాన్నంతా బాబా ఎంత మంచిగా అర్థం చేయించి మన జీవితాన్ని ఎంతగా రక్షిస్తున్నారు!

పిల్లలూ, మీరు దుఃఖాన్ని ఇవ్వకూడదు, దుఃఖాన్ని తీసుకోకూడదు అని బాబా దీన్ని కూడా నేర్పించారు. ఇది కూడా చాలా వివేకమైన పని. నా అంతిమ గతి మంచిగా ఉండాలి అని సంకల్పము చెయ్యండి, చాలు. నేను శరీరమును వదిలిన ఆ క్షణంలో నాకు నా దేహముగానీ లేక దేహధారుల స్మృతిగానీ గుర్తు రాకూడదు, అటువంటి స్థితి కోసం నేను ఎల్లప్పుడూ తయారుగా ఉంటాను. నిర్లక్ష్యముతో సమయాన్ని వ్యర్థంగా పోగొట్టుకోకూడదు. నాలుకపై ఎప్పుడూ ఎటువంటి చేదుతనము రాకూడదు, ఈ అటెన్షన్ పెట్టుకోవాలి, బాబా ప్రేమ మనల్ని ఎంత అతీతులుగా, ఎంత ప్రియమైనవారిగా తయారుచేస్తుంది! వారే లైట్‌హౌస్ కార్యము చేస్తారు. బాబా చిరునవ్వే మనసుకు శక్తినిస్తుంది.

మనందరి జీవనశైలి ఎంత సింపుల్‌గా అయిపోయింది – ఉండటము, తినటము, త్రాగటము, దృష్టి, వృత్తి, స్మృతి అన్నింటిలో సింపుల్‌గా కూడా ఉన్నాము మరియు రాయల్‌గా కూడా ఉన్నాము. సత్యతాశక్తి అందరినీ ఎగరవేస్తూ ఉంది, ఎటువంటి కష్టము లేదు. బాబాకు మనపై చాలా ఆశలు ఉన్నాయి ఎందుకంటే మనమే సత్యయుగ స్థాపనకు పునాది, అందుకోసం బాబా ప్రతి పనిలో సావధానపరుస్తారు, ధర్మరాజు శిక్షలు తినే విధంగా మన పనులు ఉండకూడదు. మన బాబా ఎంతటి దయాహృదయులు, వారి ఆశీర్వాదాలే ఔషధంలా పనిచేస్తాయి, కానీ ఎవరికైతే బ్యాలెన్స్ పెట్టుకోవటం వస్తుందో వారికే బ్లెస్సింగ్‌లు లభిస్తాయి. బాబా పిల్లలమైన మనము అదృష్టవంతులం ఎందుకంటే పాతది, పరాయిది అయిన ఏ విషయమూ గుర్తు రాదు. సహనశక్తి ఉన్న కారణంగా ఈరోజు నా మూడ్ పాడైంది అని మనము ఎప్పుడూ అనము. ఏ విషయమూ కష్టమనిపించదు. బాబా స్మృతిలో ఉంటూ ఏ పనినైతే చేస్తారో దాని ఫలితం చాలా మంచిగా ఉంటుంది. సత్యయుగంలో అయితే మంచి పనికి ఫలితము లభించనే లభిస్తుంది కానీ ఇప్పుడు కూడా చాలా మంచి ఫలమును తింటున్నాము.

చెప్పండి, ఇటువంటి అనుభవమే ఉంది కదా! ఇప్పుడైతే బాప్‌దాదా యొక్క ఈ సీజన్ చాలా మంచిగా సఫలమైంది, అందరూ బాబా దృష్టి ద్వారా శక్తి నింపుకుని మంచిగా రిఫ్రెష్ అయ్యి వెళ్ళారు. ఇప్పుడు మళ్ళీ వార్షిక మీటింగ్ మరియు సేవలకు చెందిన భిన్న-భిన్న కార్యక్రమములు మధువనములో మూడు స్థానాలలో జరుగుతూ ఉంటాయి. అచ్ఛా.

అందరికీ చాలా చాలా ప్రియస్మృతులు

ఈశ్వరీయ సేవలో

బి.కె. జానకిదాది.

## “అతీంద్రియ సుఖమయ జీవితాన్ని అనుభవము చెయ్యండి మరియు చేయించండి”

1. బాబా లభించారు, అన్నీ లభించాయి – ఈ స్మృతితో అతీంద్రియ సుఖమయ జీవితాన్ని అనుభవము చేస్తూ ఉండండి. దుఃఖానికి సంబంధించి అవిద్యులు, దుఃఖము యొక్క అంశము కూడా ఉండకూడదు. భవిష్యత్తులో ఏ విధంగా దుఃఖము మరియు అశాంతుల అజ్ఞానము ఉంటుందో, అలా ఇప్పుడు కూడా దుఃఖ–అశాంతులతో కూడిన ప్రపంచమే వేరు, వారు కలియుగానికి చెందినవారు, మేము సంగమయుగానికి చెందినవారము అని అనుభవము చెయ్యండి. సంగమయుగము ఉన్నదే అతీంద్రియ సుఖములో ఉండే సమయము, ఈ అనుభవము సత్యయుగములో కూడా ఉండదు. కాబట్టి ఎటువంటి సమయమో అటువంటి లాభము పొందండి.

2. స్థాపన ఆదిలో ఒక్క ఓంకార ధ్వని మాత్రమే ప్రారంభమైంది, దానికే ఎంతమంది సాక్షాత్కారాలలోకి వెళ్ళిపోయారు! ఉత్సాహము వచ్చేది. అలా ఇప్పుడు అనుభూతులకు చెందిన అల వ్యాపింప చెయ్యండి. జలపాతాలు ప్రవహిస్తున్నప్పుడు ఆ జలపాతాల క్రిందకు ఎవరు వచ్చినా వారికి శీతలత, తాజాదనము అనుభవమవుతుంది, అలా ఎవరు సభలోకి వచ్చినా వారికి శాంతి, శక్తి, ప్రేమ, ఆనందము, అతీంద్రియ సుఖములకు చెందిన అనుభూతి కలగాలి. ఇందుకోసం పిల్లలైన మీరు మాస్టర్ శాంతి, శక్తి మరియు సుఖ సాగరులుగా అవ్వండి.

3. బాబా స్మృతే అతీంద్రియ సుఖానికి చెందిన ఊయల, ఎల్లప్పుడూ ఈ ఊయలలో ఊగుతూ ఉండండి. ఒక్క బాబా తప్ప ఇతరులెవ్వరూ లేరు – ఈ అనుభూతిలోనే అతీంద్రియ సుఖము ఇమిడి ఉంది. ఈ అతీంద్రియ సుఖ ప్రాప్తిలో మనసు సదా సంతోషముతో నాట్యము చేస్తూ ఉండాలి.

4. సదా అవ్యక్త స్థితిలో ఉన్నట్లయితే మీరు చేసే ప్రతి పనిలో ఒకటేమో అలౌకికత అనుభవమవుతుంది, మరొకటి – ప్రతి కర్మ చేస్తూ కర్మేంద్రియాల నుండి అతీంద్రియ సుఖపు అనుభూతి వస్తుంది. కళ్ళు, ముఖము, నడవడిక ప్రతి సమయము అతీంద్రియ సుఖములో ఉంటాయి. ప్రతి కర్మలో ఎప్పుడైతే అలౌకికత మరియు అతీంద్రియ సుఖపు మెరుపు కనిపిస్తాయో అప్పుడే వీరు వ్యక్తములో ఉన్నా అవ్యక్త స్థితిలో స్థితులై ఉన్నారు అని అంటారు. మగ్న స్థితి కలిగినవారి ఈ గుణము ప్రతి నడవడికలో కనిపిస్తుంది.

5. ఎవరైతే సదా హర్షితులుగా ఉంటారో వారే ఆకర్షితం చేస్తారు. హర్షితము అనగా అతీంద్రియ సుఖములో ఊగటము. జ్ఞాన స్మరణ చేస్తూ హర్షితంగా అవ్వాలి. అవ్యక్త స్థితి అనుభవము చేస్తూ అతీంద్రియ సుఖములో ఊగటము – హర్షితము అని దీన్నే అంటారు. మనసు మరియు తనువు – ఈ రెండింటితోనూ హర్షితంగా ఉండాలి.

6. ఏదైనా సర్వీస్ చేస్తే జీతము ఎలా లభిస్తుందో, అలా ఈశ్వరీయ సర్వీస్ చెయ్యటం ద్వారా ఏ జీతము లభిస్తుంది? దీనివలన భవిష్యత్తు అయితే తయారవుతుంది కానీ భవిష్యత్తులో కంటే ఎక్కువగా ఇప్పటి ప్రాప్తి ఉంది – అది ఈశ్వరీయ అతీంద్రియ సుఖము. ఇటువంటి అతీంద్రియ సుఖము మొత్తము కల్పములో మరెప్పుడూ లభించదు. ఇది బాబా ద్వారా లభించిన ఎటువంటి ఖజానా అంటే దీన్ని ఒక్క క్షణములో అనుభవము చేసుకోగలరు.

7. పేదలు ఏవిధంగా భిక్ష కోసం వస్తారో, అలా ముందు ముందు శాంతి మరియు సుఖపు అనుభవాలలో బికారులుగా ఉన్న ఆత్మలు రోజు రోజుకీ భిక్ష కోసం తపిస్తారు. ఇప్పుడు కేవలము ఒక్క దుఃఖపు అల వచ్చినట్లయితే అలలలో కొట్టుకుపోతున్నవారు, అలలలో మునిగిపోతున్న ఆత్మలు సహాయము కోసం ఒక్క గడ్డిపోచకోసమైనా వెతుకుతారు, అలా మీ ముందుకు అనేక బికారీ ఆత్మలు యాచన కోసం వస్తారు. మరి తపిస్తున్న అటువంటి దాహార్తులైన ఆత్మల దాహము తీర్చేందుకు మిమ్మల్ని మీరు అతీంద్రియ సుఖముతో మరియు సర్వశక్తులతో నిండుగా చేసుకోండి. దీనికోసం మీ స్థితి కూడా స్థిరంగా చేసుకోవాలి మరియు ఇతర ఆత్మలను కూడా సంపన్నంగా చెయ్యగలగాలి.

8. అతీంద్రియ సుఖము లభించటం వలన ఇంద్రియాల సుఖానికి చెందిన ఆకర్షణ ఏదైతే ఉందో అది సమాప్తమైపోతుంది. ఇంద్రియాల ఆకర్షణ, సంబంధాల ఆకర్షణ లేక ఏదైనా కర్మేంద్రియానికి వశమవ్వటం వలన భిన్న–భిన్న ఆకర్షణలు ఏవైతే కలుగుతాయో, అవి అతీంద్రియ సుఖములో మరియు హర్షితాన్ని కలిగించటంలో బంధనాలు వేస్తాయి, కనుక సర్వఆకర్షణల నుండి ముక్తులై ఒక్క ఆశ్రయస్థానముపై బుద్ధిని పెట్టి ఏకరస స్థితి తయారుచేసుకోండి.

9. ఇప్పుడు మాయ యుద్ధము నుండైతే అందరూ బయటపడ్డారు కదా! ఒకవేళ ఇప్పుడు కూడా మాయ యుద్ధము జరుగుతూ ఉన్నట్లయితే ఇక అతీంద్రియ సుఖమయ జీవితము ఎప్పుడు అనుభవము చేస్తారు? రాజ్యభాగ్యమునైతే భవిష్యత్తులో అనుభవము చేస్తారు కానీ అతీంద్రియ సుఖపు అనుభవము ఇప్పుడు చెయ్యకపోయినట్లయితే మరెప్పుడూ చెయ్యలేరు. బాబా పిల్లలుగా అయ్యి వర్తమాన అతీంద్రియ సుఖపు పూర్తి అనుభవము ప్రాప్తి చేసుకోనట్లయితే మరేం ప్రాప్తి చేసుకున్నట్లు!

10. ఎల్లప్పుడూ ఇదే ఆలోచించండి - సంగమయుగ శ్రేష్ఠ వారసత్వమైన అతీంద్రియ సుఖము సదాకాలము ప్రాప్తించి ఉందా? సదాకాలపు ప్రాప్తి కోసమే బాబా పిల్లలుగా అయ్యారు, మళ్లీ ఈ అల్పకాలిక అనుభవము ఎందుకు? స్థిరమైన, అచంచలమైన అనుభవము ఉండాలి. అప్పుడే స్థిరమైన అఖండ స్వరాజ్యము ప్రాప్తి చేసుకోగలరు.

11. వారసులైనట్లయితే వారసుల గుర్తు - అతీంద్రియ సుఖ వారసత్వమునకు అధికారులు. వారసులకు బాబా అన్నింటినీ వీలునామా చేసేస్తారు, ఎవరికైతే బాబా విల్‌పై పూర్తి ఆధికారము ఉంటుందో వారే విల్‌పవర్ కలిగినవారుగా అవుతారు. వారు చేసే ఒక్కొక్క సంకల్పము విల్‌పవర్ కలిగినదిగా ఉంటుంది. ఒకవేళ విల్‌పవర్ ఉన్నట్లయితే అసఫలత ఎప్పుడూ ఉండదు.

12. సంగమయుగపు ఈ మనోహర సమయములో అతీంద్రియ సుఖపు వారసత్వము నిరంతరము అనుభవము చేసుకునేందుకు ఇక్కడ ఉన్నామే కానీ బలహీనతల కారణంగా కాదు. మీ కోసం ఈ పాత ప్రపంచము విదేశము వంటిది. చాలామంది విదేశీ వస్తువులను తాకను కూడా తాకరు, స్వదేశీ వస్తువులను వాడుతాము అని అనుకుంటారు. పిల్లలైన మీరు కూడా అలా ఈ పాత ప్రపంచపు అనగా విదేశీ వస్తువులను తాకను కూడా తాకకూడదు.

13. ఇప్పుడు ఏ అతీంద్రియ సుఖమునైతే ప్రాప్తి చేసుకుంటున్నారో అందులో శాంతి మరియు సంతోషములు ఇమిడి ఉన్నాయి. ఇది సంగమయుగ వారసత్వం. అతీంద్రియ సుఖం మరియు పూర్తి జ్ఞానములు ఈ సమయములోని ప్రాప్తి, ఇది మరెప్పుడు కూడా లభించదు. కేవలము సాక్షీతనపు సింహాసనముపై కూర్చుని ప్రతి అడుగులో, ప్రతి సంకల్పములో బాప్-దాదాను సదా సహచరునిగా అనుభవము చెయ్యండి, సహచరత్వమును ఎంతగా అనుభవము చేస్తారో అంతగానే అచంచలమైన, స్థిరమైన స్థితిలో ఉండి అతీంద్రియ సుఖపు అనుభవము చేస్తారు.

14. ఈ అలౌకిక-అతీంద్రియ సుఖము మరియు మన్‌రస్ స్థితిని అనుభవము చేసుకునేందుకు మన్మనాభవ స్థితి కావాలి. ఒకవేళ స్వయమే దేహ-అభిమానంలో లేక దేహ ప్రపంచములో అంటే పాత ప్రపంచానికి చెందిన ఏ వస్తువుకు చెందిన రసము(ఆకర్షణ)లోనైనా ఇరుక్కుపోయినట్లయితే ఇతరులకు మన్‌రస్ యొక్క అనుభవాన్ని ఎలా చేయించగలరు?

15. ఎంతగా చివరి స్థితి అనగా కర్మాతీత స్థితి సమీపంగా వస్తూ ఉంటుందో అంతగా శబ్దము నుండి దూరమైన శాంత స్వరూపపు స్థితి చాలా మంచిగా అనిపిస్తుంది, ఇటువంటి స్థితిలో సదా అతీంద్రియ సుఖపు అనుభూతి ఉంటుంది. ఈ అతీంద్రియ సుఖమయ స్థితి ద్వారా అనేక ఆత్మలను సహజంగానే ఆహ్వానము చెయ్యగలరు. ఈ శక్తిశాలీ స్థితినే విశ్వకళ్యాణకారీ స్థితి అంటారు.

16. సంగమయుగంలో ప్రతి కార్యమునకు ఫలితము అతీంద్రియ సుఖము, ఇది తప్ప అల్పకాలికమైన పేరు ప్రతిష్ఠలు, గౌరవాలు లేక ప్రకృతి దాసి యొక్క ఫలమును స్వీకరించినట్లయితే భవిష్యత్తు అంతమైపోతుంది. కాబట్టి ఇక్కడే చేసుకున్నాము, ఇక్కడే తినేసామా లేక జమకూడా అవుతుందా? అన్నది పరిశీలించుకోండి. బాబా ఏదైతే చెప్పారో, ఎంతైతే చెప్పారో దాని ప్రత్యక్ష ఫలము ఇక్కడ కూడా తీసుకోండి మరియు భవిష్యత్తు కోసం కూడా జమ చేసుకోండి.